క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని నూనావత్ సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనుల నేపథ్యంలో మంగళవారం సబ్‌స్టేషన్ పరిధిలోగల నూనావత్‌తండా, కేశవాపురం, రాళ్లవాగుతండాతోపాటు కొండ్రపోల్ ఫీడర్ల కింద ఉన్న గ్రామాల్లో ఉదయం ఆరు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ అబ్దుల్లా హబీబ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

భర్త మరణం తట్టుకోలేక భార్య మృతి

నాగార్జునసాగర్ : భర్త మరణం తట్టుకోలేక భార్య గుండెపోటుతో మృతిచెందింది. వివరాలు.. నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీకి చెందిన రిటైర్డ్ ఉద్యోగి గోరంట్ల శివశంకర్(84) ఈ నెల 20న అనారోగ్యంతో మృతిచెందాడు. సోమవారం శివశంకర్ భార్య జయమ్మ(75) గుండెపోటుతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వారికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం.

ఆర్థిక సాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డి

పెద్దవూర : మండలంలోని గర్నెకుంట గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ బొంగరాల రజిత ఇటీవల మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి సోమవారం గర్నెకుంటకు వెళ్లి ఆమె కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి సాగర్ వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి, చింతపల్లి మాజీ సర్పంచ్ సుంకిరెడ్డి ప్రభావతిసంజీవరెడ్డి, శాగం శ్రావణ్‌కుమార్‌రెడ్డి, బుర్రి రాంరెడ్డి, గడ్డం సజ్జన్, కూన్‌రెడ్డి సంతోష్‌రెడ్డి, వంగాల భాస్కర్‌రెడ్డి, తేరా అఖిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రవికుమార్‌కు బెస్ట్ ట్రైనర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న రవికుమార్

మిర్యాలగూడ టౌన్ : ఇంపాక్ట్ ఇంటర్నేషన్ సర్టిఫికేట్, బెస్ట్ ట్రైనర్ అవార్డుకు పట్టణానికి చెందిన రవికుమార్ ఎంపికయ్యారు. సోమవారం నల్లగొండలో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ జడ్జి డివికె తేజో కార్తీక్ ఆ అవార్డును రవికుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ నేటి సమాజానికి తన వంతు సేవలను అందించేందుకు ఈ అవార్డు అందించారన్నారు. 2024 సంవత్సరానికి గాను తనకు ఈ అవార్డు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్, శ్యాం, రాథోడ్, చెన్నయ్య, సరిత తదితరులున్నారు.

సేంద్రియ సాగు రైతుకు ఉత్తమ పురస్కారం

గుర్రంపోడు : మండలంలోని బ్రాహ్మణగూడెం గ్రామానికి చెందిన సేంద్రియ సాగు రైతు కట్టెబోయిన వెంకటేశ్వర్లుకు ఉత్తమ రైతు పురస్కారం దక్కింది. ఆదివారం భద్రాచలంలో నిర్వహించిన సేంద్రియ వ్యవసాయ సమ్మేళనంలో తనకు ఉత్తమ రైతు పురస్కారాన్ని ఆదిగురు భారత రైతు సంఘం రాష్ట్ర నాయకులు పోలె మెండయ్య, బాపారావుల అందజేసినట్లు రైతు తెలిపారు.సేంద్రియ వ్యవసాయం చేస్తూ, ఇతర రైతులను ప్రోత్సహించినందుకు తనకు ఈ అవార్డు దక్కిందని తెలిపారు.

నేడు నల్లగొండలో ట్రాఫిక్ ఆంక్షలు

నల్గొండ క్రైమ్ : హనుమాన్ శోభాయాత్ర సందర్భంగా మంగళవారం నల్లగొండ పట్టణ కేంద్రంలో శోభాయాత్ర నిర్వహించే ప్రాంతాల్లో సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు ఎస్పీ చందనా దీప్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మునుగోడు నుంచి వచ్చే వాహనాలను ఈద్గా నుంచి రూరల్ పోలీస్ స్టేషన్ వైపు మళ్లిస్తారని అన్నారు. అదేవిధంగా దేవరకొండ నుంచి వచ్చే వాహనాలు డీఈఓ ఆఫీసు నుంచి నటరాజ్ థియేటర్ మీదుగా బస్టాండ్ వైపు, పానగల్ నుంచి నల్లగొండ పట్టణంలోకి వచ్చే వాహనాలను రామాలయం దగ్గర నుంచి బోయవాడ మీదుగా బస్టాండ్ వైపు, మైసయ్య విగ్రహం నుంచి ప్రకాశం బజార్‌కు వచ్చే వాహనములు బస్టాండ్ సమీపం నుంచి బీటీఎస్ రోడ్డు వైపు, హైదరాబాద్ నుంచి నల్లగొండ పట్టణం వైపు, నల్లగొండ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనములు ఎన్టీఆర్ విగ్రహం నుంచి వివేకానంద విగ్రహం వరకు వన్ వేలో వెళ్లవలసి ఉంటుందన్నారు. వాహనదారులు పోలీసు సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఆదమరిస్తే ప్రమాదమే..

- మిర్యాలగూడలో ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్
- పలు చోట్ల ధ్వంసమైన మూతలు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు, పాదచారులు


పంచాయతీరాజ్ డీఈ కార్యాలయం సమీపంలో మూతలేకుండా ఉన్న మ్యాన్‌హోల్


ఎన్ఎస్‌పీ క్యాంపు వద్ద మ్యాన్ హోల్ దుస్థితి..

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో కప్పుల్లేని మ్యాన్‌హోల్స్ ఉన్నాయి. అలాగే పలు చోట్ల మూతలు శిథిలమై ఉన్నాయి. దీంతో ప్రజలు మున్సిపల్ అధికారలకు ఫిర్యాదు చేసినా.. వారిలో ఎలాంటి స్పందన లేదు. అధికారుల నిర్లక్ష్యం.. పాలకుల అలసత్వం కారణంగా ప్రయాణికులు ఏమారితే అవస్థలు పడాల్సి వస్తోంది. నోళ్లు తెరుచుకున్న మ్యాన్‌హోల్స్‌తో వర్షకాలంలో చాలా ఇబ్బంది ఏర్పడుతుంది. మిర్యాలగూడ మున్సిపాలిటీలో అధికారుల పర్యవేక్షణ లోపం.. గుత్తేదారులకు వరంగా మారుతుంది. కోట్లాది రూపాయాలు ఖర్చు చేసి నిర్మిస్తున్నా కొద్ది రోజులు మాత్రమే ఉంటున్నాయి. నాణ్యతకు తిలొదకాలు ఇచ్చి నిర్మించి ఈ మ్యాన్‌హోల్స్‌పై మూతలు వేస్తున్నప్పటికీ త్వరగానే విరిగిపోతున్నాయి.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్

మున్సిపాలిటీలో 16 ఏళ్ల క్రితం నిర్మించిన మ్యాన్‌హోళ్లు పలు చోట్ల నోళ్లు తెరుచుకొని ప్రమాదకరంగా మారాయి. మురుగునీటిన శుద్ధి చేసి పంట పొలాలకు సాగునీటిని అందించాలనే లక్ష్యంతో తాళ్లగడ్డ, రాంనగర్ బంధం వద్ద 50 ఎకరాల్లో మురుగునీటి శుద్ధి కేంద్రాలు(ఎస్టీపీ)ఏర్పాటు చేశారు. అయితే అప్పటి ప్లాన్ ప్రకారం మున్సిపాలిటీలో మొత్తం 170 కిలో మీటర్లు వరకు పైపులైన్ల నిర్మాణ పనులు పూర్తి చేయడంతో పాటు సుమారు 7500 వరకు మ్యాన్‌హోల్స్ పూర్తి చేశారు. అయితే ప్రస్తుతం అందులో సుమారుగా 4500వరకు మ్యాన్‌హోల్స్ కుంగిపోయి, ధ్వంసమయ్యాయి. మరికొన్ని చోట్ల మ్యాన్‌హోల్స్‌పై మూతలు లేకుండా ఉన్నాయి. ఇవి ఇలా ఉంటే రాబోయే వర్షాకాలంలో ఇబ్బంది మారుతుందని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మ్యాన్‌హోల్స్‌పై దృష్టిసారించాలి



మున్సిపాలిటీలో పలు చోట్ల మ్యాన్‌హోల్స్‌పై మూతలు లేకుండా ఉన్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో పూర్తిగా ధ్వంసం కాగా మరికొన్ని ప్రాంతాల్లో ప్రమాదకరంగా మారాయి. ఈ విషయంపై మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదు. ప్రమాదాలు పొంచి ఉన్నందునా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.

– చిల్లంచర్ల అభి, మిర్యాలగూడ

మరమ్మతులు చేయిస్తాం



మున్సిపాలిటీలో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్స్ విషయం దృష్టికి రాలేదు. గతంలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణాలు పబ్లిక్ హెల్త్ వింగ్ ఆధీనంలో పనులు నడిచాయి. ఈవిషయంపై పబ్లిక్ హెల్త్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం. తాను ఇటీవల వచ్చినందున మ్యాన్‌హోల్స్ సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకుంటా.

– మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

ప్రతి ఒక్కరూ భక్తిభావంతో మెలగాలి


మాజీ మంత్రి జానారెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

హాలియా : ప్రతి ఒక్కరూ భక్తిభావంతో మెలిగి సన్మార్గంలో పయనించాలని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీస్వయంభూ గంగమ్మతల్లి ఆలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జానారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అనంతరం మాజీ మంత్రి జానారెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు గౌనీ రాజా రమేష్ యాదవ్, వెంకటేశ్వర్లు, కాశయ్య, గోవింద్, రామయ్య , శ్రీనివాస్, మల్లిఖార్జున్, రాజశేఖర్, బాలకృష్ణ, కొండల్, కూరాకుల శ్రీనివాస్, తిరుపతయ్య. శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌వి అమలుకు సాధ్యంకాని హామీలు


పెద్దఅడిశర్లపల్లి : మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి


మిర్యాలగూడ : బీఆర్ఎస్ ప్రచార రథాలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

పెద్దఅడిశర్లపల్లి : అమలుకు సాధ్యంకాని హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం పెద్దఅడిశర్లపల్లి మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. తనను గెలిపించి లోక్‌సభకు పంపితే రైతుల పక్షాన కొట్లాడుతానన్నారు. అనంతరం మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్‌లు మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని అత్యధిక మెజారీటితో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యాయాదవ్, బీఆర్ఎస్ నాయకులు కిషన్‌నాయక్, వల్లపురెడ్డి, ముత్యంరావు, సుధాకర్ గౌడ్, సిరసువాడ శ్రీను, నరేందర్‌నాయక్, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీను, పాల్గొన్నారు.

అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

మిర్యాలగూడ : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించేలా కార్యకర్తలు కృషిచేయాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. సోమవారం పట్టణంలోని రెడ్డికాలనీలో పార్లమెంట్ ఎన్నికల బీఆర్ఎస్ ప్రచార రథాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మిర్యాలగూడ నుంచి కంచర్ల కృష్ణారెడ్డికి భారీ మెజారిటీ వచ్చేలా ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, దామరచర్ల జెడ్పీటీసీ ఆంగోతు లలిత హాతీరాంనాయక్, అడవిదేవులపల్లి ఎంపీపీ బాలాజీనాయక్, జిల్లా కోఆప్షన్ సభ్యుడు మోసిన్ అలీ, రైతు సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు నామిరెడ్డి యాదగిరిరెడ్డి, నాయకులు చిట్టిబాబు నాయక్, వీరకోటిరెడ్డి, సిద్దార్థ, బబయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక


బాక్సింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మిర్యాలగూడ టౌన్: హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఈనెల 26నుంచి 28వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు మిర్యాలగూడ విద్యార్థులు ఎంపికయ్యారు. సోమవారం స్థానిక రాజీవ్ గాంధీ స్టేడియం బాక్సింగ్ హాల్‌లో ఉమ్మడి నల్లగొండ యూత్ ఆధ్వర్యంలో బాక్సింగ్ బాల బాలికల జట్లను ఎంపిక చేశారు. బాలికల విభాగం నుంచి ఎల్. లావణ్య, ఆర్. సాయి ప్రణీతి, కె. అంజలి, శ్రీకావ్యరెడ్డి, బాలుర విభాగంలో ఎస్. సుమంత్, ఎస్. సాయిచరణ్, మహ్మద్‌అలీ, మహ్మద్ అమీర్, ఎస్‌కె వమీజ్, ఎస్. విశ్వనాథంలు వివిధ విభాగాలకు ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి మఖ్బూల్ అహ్మద్, తెలంగాణ రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి ఇ. రవీందర్‌లు ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో రాణించి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

హనుమాన్ జయంతిని విజయవంతం చేయాలి

డిండి : మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించే హనుమాన్ జయంతి కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని హనుమాన్ శక్తి జాగరణ సమితి సభ్యుడు ఏటి.కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని, సాయంత్రం ఆలయం ప్రాంగణం నుంచి మేళ తాళాల మధ్య గ్రామ పురవీధుల గుండా హనుమాన్ శోభాయాత్ర కొనసాగుతుందని పేర్కొన్నారు.

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే వీర హనుమాన్ విజయయాత్రను విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ ఉమ్మడి నల్లగొండ జిల్లా విభాగ్ కార్యదర్శి గంజి సుధాకర్, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి కోరారు. సోమవారం స్థానిక ఎన్ఎస్‌పీ క్యాంపులో గల శ్రీసీతారామాంజనేయ స్వామి దేవాలయంలో జరిగిన సమావేశం లో వారు మాట్లాడారు. ఈ విజయ యాత్రను విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఈనెల 23న సాయంత్రం 4గంటలకు శాంతినగర్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం నుంచి విజయ యాత్ర ప్రారంభం అవుతుందన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా సహ కోశాధికారి వెంకన్న, రాంకుమార్, మిర్యాలగూడ నగర కార్యదర్శి శ్రీనివాస్, ప్రవీణ్, కిరణ్‌రాజు, నరేష్, శ్రీనివాస్, సత్యనారాయణ, రాంప్రసాద్, ప్రసాద్, జనార్దన్, లక్ష్మమ్మ, రవి, ఆలయ అర్చకులు వెంకటాచార్యులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ ఫలితాల్లో ప్రాథమిక పాఠశాల హవా

- శిల్గపురంలో 25మంది విద్యార్థులకు గాను 22మందికి సీటు


గురుకుల సీటు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఐదో తరగతి గురుకుల ప్రవేశ ఫలితాల్లో మండలంలోని శిల్గాపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. 25మంది విద్యార్థులకు గాను 22మంది సీట్లు సాధించి ఉత్తమ ప్రతిభ కనబర్చారని ఆ పాఠశాల హెచ్ఎం సైదయ్య తెలిపారు. సీట్లు సాధించిన విద్యార్థులను సోమవారం పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్ఎం సైదయ్య మాట్లాడుతూ నాలుగేళ్ల నుంచి గురుకుల ప్రవేశిక ఫలితాల్లో పాఠశాల విద్యార్థులు చక్కని ప్రతిభను కనబర్చుతున్నట్లు ఆయన తెలిపారు. ఉత్తమ ఫలితాలను గుర్తించి శిల్గాపురంతో పాటు, నాలుగు గ్రామాల విద్యార్థులు తమ పాఠశాలకు ఆటోల ద్వారా వస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శివప్రసాద్, ఎరనాగుల సైదులు, శిరీష, కల్పన, వసంత తదితరులు పాల్గొన్నారు.

27నుంచి సమ్మర్ క్యాంప్


క్యాంప్ పోస్టర్ విడుదల చేస్తున్న ముస్లిం మతపెద్దలు

మిర్యాలగూడ : ఈనెల 27 నుంచి పైజే రషీద్ పేరుతో స్థానిక ఉస్మానియా మజీద్‌లో పిల్లలకు ఉచిత సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు జమాతే ఉల్మా నియోజకవర్గ అధ్యక్షుడు వలిఉల్లా తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక ఉస్మానియా మసీదులో సమ్మర్ క్యాంప్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 6–15ఏళ్ల పిల్లలకు మంచి అలవాట్లు, వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు 20 రోజులపాటు స్థానిక ఉస్మానియా మసీదులో సమ్మర్‌క్యాంప్ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ తరగతుల్లో ఇస్లామిక్ క్రీడ్, ఫిక్ ఆఫ్ తహరహత్ అండ్ నమాజ్, ఇస్లామిక్ హిస్టరీ లోపేట్స్ అండ్ సహబహ్‌తోపాటు మరికొన్ని ఇస్లామిక్ కోర్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10.30గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు పట్టణ పరిసర ప్రాంతాల ముస్లిం విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ తరగతులు పూర్తయిన తరువాత పరీక్షలు నిర్వహిస్తారని, అందులో ప్రతిభ కనబరిచిన ముగ్గురికి సైకిళ్లు బహుమతిగా అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మౌలానా అతిక్కుల్ రెహమాన్, మౌలానా మున్నాన్, ముస్లిం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అహ్మద్ చావుష్, కౌన్సిలర్ జాని, బాబ్‌జాని, మసీద్‌కమిటీ అధ్యక్షుడు ఎండీ.ఇస్మాయిల్, మార్క్‌స్‌పాషా, సయ్యద్, నవాజ్, సుల్తాన్, నిసర్, హఫీజ్, సికిందర్, కరీమొద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

సుధీర్‌బాబుకు ఉత్తమ కవితా పురస్కారం


ఉత్తమ కవితాపురస్కారం అందుకుంటున్న సుధీర్‌బాబు

గుర్రంపోడు : మండలంలోని పోచంపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో ఉన్నత పాఠశాల తెలుగు భాషోపాధ్యాయుడు, రచయిత, కవి, మద్దోజు సుధీర్‌బాబు ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కవి సమ్మేళనంలో పాల్గొని ఉత్తమ కవితగా ఎంపికైన తన కవిత ధర్మగంటను చదివి వినిపించారు. తెలుగు కవుల సంఘం, కళాసూర్య కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మేళనంలో ప్రశంసపత్రాన్ని సుధీర్‌బాబుకు నిర్వాహకులు వెంకటరమణ, ప్రభాకరాచారి అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్‌బాబును చండూరు సాహితీమేఖల ప్రధాన నిర్వాహకులు మంచుకొండ చినభిక్షమయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళా వెంకన్న, సన్‌షైన్ పాఠశాల ప్రిన్సిపాల్ కోడి వెంకన్నలు అభినందించారు.

కాంగ్రెస్‌లో చేరిన మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్


జానారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ బిన్ని

నాగార్జునసాగర్: మాజీమంత్రి కుందూరుజానారెడ్డి సమక్షంలో నందికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ మందా రఘువీర్‌కుమార్ (బిన్ని)సోమవారం ఆయన నివాసంలో బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. నందికొండ హిల్‌కాలనీలోని జానారెడ్డి నివాసంలో ఆయన తనయుడు ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి పార్టీ కండువాను కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, పెద్దవూర మండలం మాజీ ఎంపీపీ శంకర్‌నాయక్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబ సభ్యులకు పరామర్శ


చింతపల్లి : శ్రీహరి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

చింతపల్లి : మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వరనగర్‌కు చెందిన ఊరే శ్రీహరి మృతి చెందడంతో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సోమవారం ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన వెంట దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీపీ కొండూరు భవాని, సీపీఐ నాయకులు నల్లా నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


నిడమనూరు : సురేందర్ రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

కాంగ్రెస్ నాయకుడు సురేందర్‌రెడ్డికి నివాళి

నిడమనూరు : మండలంలోని మారుపాకకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మేరెడ్డి సురేందర్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. సోమవారం ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి ఆ గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.అనంతరం సురేందర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు తస్యం, నర్సింగ్ విజయ్‌కుమార్, సురేందర్ రెడ్డి ఉన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషిచేయాలి


మాట్లాడుతున్న కో-ఆర్డినేటర్ పృథు

దేవరకొండ : విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్య సాధనకు కృషి చేయాలని దేవరకొండ ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రమావత్ రవి , కోఆర్డినేటర్ పృథు అన్నారు. కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థి అజయ్‌కుమార్ ఇటీవల ఇండియన్ ఆర్మీ అగ్నిపథ్ పథకంలో సోల్జర్‌గా సెలెక్ట్ అయినట్లు తెలిపారు. ఆదివారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తాను అగ్నిపథ్‌కు ఎంపికైన విధానం, విధి నిర్వహణ వంటి అంశాలపై పూర్వ విద్యార్థి వివరించారు. టీఎస్‌కేసీ-కెరీర్ గైడన్స్, ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శివకృష్ణ తదితరులు ఉన్నారు.

మేడే ను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న పల్లా దేవేందర్‌రెడ్డి

నల్లగొండ టౌన్ : మేడే ను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, అధ్యక్షుడు నూనె రామస్వామి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నో త్యాగాలు పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని, 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులు మరణిస్తే రూ.10 లక్షల పరిహారాన్ని చెల్లించాలని, రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో ఎండీ. సయిద్, సుమతమ్మ, దోటి వెంకన్న, డి.వెంకన్న, ఎండీ. జాని, శంకర్, గుండె రవి, వెంకట్‌రాములు, కోట్ల సుభాష్, వి.లెనిన్, మల్లయ్య, నీల వెంకటయ్య, అమీర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని గెలిపించాలి


ఇంటింటి ప్రచారం చేస్తున్న నాయకులు

దేవరకొండ : పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని దేవరకొండ యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముకురోజు రాజు కోరారు. సోమవారం మండల పరిధిలోని ఇద్దంపల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలని ఆయన కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిల్లి వెంకటయ్య, రవీందర్‌రెడ్డి, వెంకటయ్య, కొండల్, పర్వతాలు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల రైతులను ఆదుకోవాలి

నల్లగొండ రూరల్: అకాల వర్షానికి నష్టపోయిన ఉద్యాన పంటలు వేసిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి అన్నారు. నల్లగొండ మండలంలోని కొత్తపల్లిలో కౌలు రైతు శ్రవన్ సాగు చేస్తున్న మునగ తోట అకాల వర్షానికి పూర్తిగా నేల కూలింది. ఈ సందర్భంగా చాడ కిషన్‌రెడ్డి సోమవారం తోటను పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. అకాల వర్షానికి నష్టపోయిన తోటలను మంత్రి పరిశీలించకపోవడం దారుణమన్నారు. ఎండిన పండ్ల తోటలకు ప్రభుత్వం నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కల్వకుంట్ల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నాగయ్య, శ్రీకాంత్ రెడ్డి, లతీఫ్, వెంకన్న, శంకర్‌రెడ్డి, సైదిరెడ్డి, కట్ట శ్రీను తదితరులు పాల్గొన్నారు.


దెబ్బతిన్న మునగ తోటను పరిశీలిస్తున్న చాడ

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కొండమల్లేపల్లి : అహ్మద్ అలీ అనే వ్యక్తి కొండమల్లేపల్లిలో తన బంధువుల ఇంటికి పని మీద వచ్చి తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈ మేరకు అప్పట్లో కొండమల్లేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు కొత్తగా తీసుకొచ్చిన సీఈఐఆర్ యాప్ ద్వారా సెల్‌ఫోన్‌ను గుర్తించారు. ఈ మేరకు సోమవారం అహ్మద్ అలీకి సెల్‌ఫోన్‌ను అందజేశారు.

అసత్య ఆరోపణలు చేయడం తగదు

నల్లగొండ టూటౌన్ : మాజీ సీఎం కేసీఆర్, మాజీమంత్రి జగదీష్‌రెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి సోదరులు అసత్య ఆరోపణలు చేయడం తగదని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున అన్నారు. సోమవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్, జగదీష్‌రెడ్డిపై అసత్యాలు, బూతు మాటలు మాట్లాడడం సరైంది కాదన్నారు.

బండారు వెంకటమ్మకు నివాళి

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారు ప్రసాద్ మాతృమూర్తి వెంకటమ్మ సోమవారం సాయంత్రం అనారోగ్యంతో మృతిచెందారు. వెంకటమ్మ మృతదేహాన్ని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వర్షిత్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, రామరాజు యాదవ్, బొజ్జ నాగరాజు, నాగిరెడ్డి, మునికుమార్ నివాళులర్పించారు.

శానంపూడిని కలిసిన డ్వాబ్ ప్రతినిధులు


సైదిరెడ్డికి బొకే అందజేస్తున్న చొక్కారావు

నల్లగొండ టూటౌన్: నల్లగొండ నియోజకవర్గ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన శానంపూడి సైదిరెడ్డిని సోమవారం డ్వాబ్ సంస్థ ప్రధాన కార్యదర్శి పానుగోటి చొక్కారావు కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట డ్వాబ్ సంస్థ ప్రతినిధులు ఉన్నారు.